సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



ఆహారం.. ఆరోగ్యం

ఆరోగ్యకర జీవనంలో పోషకాహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా చిన్నారుల్లో పోషకాహార లోపాలు వారి భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారతాయి.



సాయమందజేసీ

ఉద్యోగం పేరుతో మోసానికి గురై, చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిక్కుకున్న దివ్యాంగుడు, అతడి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నిషాంతి రక్షించారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 7,47,782 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. అలాగే డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులకు చేరుకుంది.

చేతికందని కష్టం

- కంద రైతుకు కన్నీళ్లు
- ధర పతనంతో కుదేలైన వైనం
- గత ఏడాది పుట్టు ధర రూ.11 వేలు
- నేడు రూ.6 వేలకు పడిపోవడంతో ఆవేదన
- ఎకరానికి సుమారు రూ.2.25 లక్షల నష్టం



పెరవలి: జిల్లాలో కంద సాగు చేస్తున్న రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. గత కొన్నేళ్లగా లాభాల బాట పట్టిన రైతులు.. నేడు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దిగుబడి బాగున్నా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాలు తప్పడం లేదు. వెరసి.. రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్టులో పుట్టు (232 కిలోలు) కంద ధర రూ.6 వేలు మాత్రమే ఉండడంతో దిగుబడి (ఊరిక) బట్టి ఎకరానికి రూ.1.05 లక్షల నుంచి రూ.2.25 లక్షలు నష్టపోవాల్సి వస్తోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ ప్రభుత్వంలో కంద రైతులు స్వర్ణయుగాన్ని సరి చూశారు. ఆనాడు గిట్టుబాటు ధర చరిత్ర సృష్టించింది. పుట్టు కంద రూ.11 వరకూ పలికింది. దీంతో రైతుల ఆదాయం బాగుండేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కంద ధర పతనం కావడంతో రైతులు కుదేలవుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడులు పెరిగినా, ధరలు లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదు. జిల్లాలోని 1,450 హెక్టార్లలో సుమారు ఆరు వేల మంది రైతులు కంద పంటను సాగు చేస్తుండగా, దానిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది ఆధారపడి ఉన్నారు. ప్రస్తుతం ఎకరానికి 50 నుంచి 70 పుట్టుల దిగుబడి వస్తోంది. ధర లేకపోవడంతో ఎకరానికి సుమారు రూ.2.25 లక్షల వరకు నష్టం రావటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సాగు విస్తీర్ణం

జిల్లాలో కంద పంట విస్తీర్ణం గత ఏడాది కంటే ఈసారి ఎక్కువైంది. గత ఏడాది ఎవరూ ఊహించని విధంగా పుట్టు కంద ధర రూ.11 వేలు పలకడం దీనికి కారణం. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, పోలవరం, కడియం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, బిక్కవోలు మండలాల్లో గత ఏడాది 1,050 హెక్టార్లలో సాగు చేస్తే, ఈ ఏడాది 1,450 హెక్టార్లకు పెరిగింది. గతంలో ఈ పంట లాభాలు తీసుకురావటంతో ఈ ఏడాది రైతులు పంట విస్తీర్ణం పెంచారు. దీంతో దిగుబడి పెరిగి, నష్టాల బాట పట్టారు.

ధర పతనం

రైతులు ఊహించని విధంగా కంద ధర ఈ ఏడాది రూ.7 వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.6 వేలకు దిగిపోయింది. గతేడాది ఇదే సమయంలో పుట్టు ధర రూ.11 వేలు ఉండగా, నేడు రూ.6 వేలకు పడిపోయింది. కంద పంట వేసినప్పుడు పుట్టు విత్తనాన్ని రూ.11 వేలకు కొనుగోలు చేయగా ఇప్పుడు మార్కెట్‌లో పుట్టు ధర రూ.6 వేలు ఉండడంతో దిగుబడి పెరిగినా రైతులకు తీవ్ర నష్టాలు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో 50 పుట్టులకు రూ.3 లక్షలు, 60 పుట్టులకు రూ.3.60 లక్షలు, 70 పుట్టులు ఊరిక ఉంటే రూ.4.20 లక్షలు వస్తోంది



అన్నవరప్పాడులో తవ్విన కంద దుంపలను శుభ్రం చేస్తున్న కూలీలు, (అంతరచిత్రం) కంద దుంపలను లారీలో లోడు చేస్తున్న కూలీలు



దిగుబడి పెరిగినా..

గత ఏడాది ఎకరానికి 50 నుంచి 60 పుట్టుల దిగుబడి వస్తే ఈ ఏడాది అది 60 నుంచి 70 పుట్టులకు పెరిగింది. కానీ ధరలు సగానికి సగం తగ్గిపోవడంతో నష్టాలు వచ్చాయి. అంతే కాకుండా గత ఏడాది లాగే ఈ ఏడాది గిట్టుబాటు ధర లభిస్తుందనే రైతులు ఆలోచించారు. దీంతో సాగు విస్తీర్ణం జిల్లాలో మరో 500 హెక్టార్లు పెరిగింది. కానీ ధర పతనం కావడంతో కంద రైతులు కుదేలయ్యారు.

రూ.లక్షల్లో పెట్టుబడి

కంద సాగుకు కోసం రైతులు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఒక ఎకరంలో ఈ పంటను సాగు చేయాలంటే 30 పుట్టుల విత్తనం వేయాలి. గత ఏడాది విత్తనం పుట్టును రూ.11 వేలు చొప్పున 30 పుట్టులకు రూ.3.30 లక్షలు, చేను దుక్కు దున్నటానికి, కంద నాటడానికి, బోదెలు తవ్వటానికి, చప్పు ఎక్కవేయటానికి కూలీలకు రూ.ఒక లక్ష, పెంట వేయటానికి రూ.30 వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ.40 వేలు, నీటి తడులు, కలుపుతీతకు రూ.25 వేలు.. కలిసి దాదాపు రూ.5.25 లక్షల పెట్టుబడి అవుతోంది. ఇక దిగుబడి ఎకరానికి 50 పుట్టులు ఉంటే ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ప్రకారం పుట్టు (232 కిలోలు) కంద ధర రూ.6 వేల చొప్పున 50 పుట్టులకు రూ.3 లక్షలు మాత్రమే వస్తోంది. 60 పుట్టులు ఉంటే రూ. 3.60 లక్షలు, 70 పుట్టులు దిగుబడులు ఉంటే రూ.4.25 లక్షలు మాత్రమే వస్తోంది. అంటే పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

ఇతర రాష్ట్రాల్లో పెరిగిన సాగు

గతంలో ఇతర రాష్ట్రాల్లో కంద సాగు చేసినా ఆంధ్రా కందకు మంచి డిమాండ్ ఉండేది. కానీ బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కంద సాగు విస్తీర్ణం పెరగటం, మన కంటే అక్కడ తక్కువ ధరకు అక్కడ లభించడంతో ఎగుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ధరలు కూడా పతనమయ్యాయి.

నష్టాల పాలవుతున్నాం



ఆరుగాలం శ్రమించి పండించిన కంద పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టాలపాలవుతున్నాం. ఎకరానికి పెట్టుబడి పోను రూ.ఒక లక్షపైనే మిగులుతుందనుకుంటే.. నేడు ఒక ఎకరానికి రూ.1.05 లక్షలు నష్టం వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పుట్టు ధర రూ.11 వేలు పలికితే నేడు రూ.6 వేలు మాత్రమే ఉంది.

– దిడ్ల సంపతిరావు, ఖండవల్లి

పెట్టుబడి కూడా రాదు



గత ఐదేళ్లు లాభాలను చూసిన మేము.. ఇప్పుడు పెట్టుబడి కూడా రాని పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. గతంలో చాలా ఆశాజనకంగా పంట ఉండేది. పుట్టు ధర పతకం కావడంతో నేడు ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలో తెలియడం లేదు.

– బొలిశెట్టి వెంకటేశ్వరరావు, అన్నవరప్పాడు

పెరిగిన సాగు విస్తీర్ణం



ఉభయ గోదావరి జిలాల్లో పండించిన కందకు చెన్నై, ముంబై మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంది. కానీ ఈ ఏడాది కంద సాగు విస్తారంగా పెరగటం, మార్కెట్‌లో వినియోగం తగ్గడంతో ధరలు దిగిపోయాయి. అన్ని జిల్లాల్లో కంద దిగుబడులు బాగుండటం కూడా మరో కారణం.

– గదుగొయ్యిల సత్యనారాయణ, కంద వ్యాపారి

న్యూస్‌రీల్

పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. దాతల ఆర్థిక సాయంతో 6,500 మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

పౌల్ట్రీ రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఇటీవల వివిధ కారణాలతో కోళ్ల మృత్యువాత పడుతున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతులు, పెరటి కోళ్ల పెంపకందారులు, మార్కెట్‌లోని వ్యాపారస్తులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. పౌల్ట్రీల యజమానులు తమ కోళ్ల ఫారాల్లో బయో సెక్యూరిటీ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందితే, సమీపంలోని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అలాగే జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయ కాల్ సెంటర్ 88340 58087ను సమాచారం ఇవ్వాలన్నారు.

కాటన్ బ్యారేజీకి తగ్గిన నీటి ఉధృతి



కాటన్ బ్యారేజ్ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీకి నీటి ఉధృతి తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు స్వల్పంగా తగ్గడంతో శనివారం రాత్రి బ్యారేజీ వద్ద పది అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 9.42 మీటర్లు, పేరూరులో 13.87 మీటర్లు, దుమ్ముగూడెంలో 10.31 మీటర్లు, భద్రాచలంలో 36.80 అడుగులు, కూనవరంలో 16.48 మీటర్లు, కుంటలో 7.84 మీటర్లు, పోలవరంలో 11.33 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.47 మీటర్ల నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏపీ ట్రాన్స్‌కో జోనల్ చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ఏపీ ట్రాన్స్‌కో ఓ–ఎం సర్కిల్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత పటిష్టమైంది. గత 50 ఏళ్లుగా సేవలందించిన 100 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో ఆధునిక 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానికి శనివారం జోనల్ చీఫ్ ఇంజినీర్ బి.శ్యాం ప్రసాద్ చార్జింగ్ చేసి, సేవలను ప్రారంభించారు. కాగా.. పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను 1976 అక్టోబర్ 18న ప్రారంభించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు అవిశ్రాంతంగా పనిచేసిన దానికి గౌరవంగా వీడ్కోలు పలికారు. చివరిసారిగా 2015 మార్చి 21న ఓవర్ ఆయిలింగ్ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్ ప్రభు, డివిజనల్ ఇంజినీర్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ పాత ట్రాన్స్‌ఫార్మర్ అందించిన సేవలు అద్భుతమైనవని కొనియాడారు. కేవలం 40 రోజుల్లోనే కొత్త 160 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం ఘనతగా పేర్కొన్నారు.

తిరుచ్చి వాహనంపై సత్యదేవుని సేవ

అన్నవరం: రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి అర్చకులు సుధీర్ తదితరులు పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

- తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- జక్కంపూడి స్వగృహంలో సర్వమత ప్రార్థనలు

సాక్షి, రాజమహేంద్రవరం: మద్యం అక్రమ కేసులో మధ్యంతర బెయిల్‌పై విడుదలైన ఎంపీ మిథున్‌రెడ్డికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక సెంట్రల్ జైల్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఏసీబీ కోర్టు వెలువరించిన బెయిల్ ఉత్తర్వులను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా జైల్ వద్దకు తీసుకొచ్చారు. అప్పటికే ఎంపీ మిథున్‌రెడ్డిని చూసేందుకు భారీగా పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. అనంతరం ఘన స్వాగతం పలికి అక్కడి నుంచి రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఇంటి వద్దకు భారీ కాన్వాయ్‌లో వెళ్లారు. అక్కడే కాసేపు పార్టీ నేతలతో మాట్లాడిన ఆయన అనంతరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన, తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ పయనమయ్యారు. స్వాగతం పలికిన వారిలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, మాజీ ఎంపీ ఎంపీ చింతా అనురాధ, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడపాటి షర్మిలా రెడ్డి, కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కన్వీనర్ జక్కంపూడి గణేష్ ఉన్నారు.



మిథున్ రెడ్డిని కలిసిన జక్కంపూడి విజయలక్ష్మి, రాజశ్రీ, జక్కంపూడి గణేష్ దంపతులు, మేడపాటి షర్మిలారెడ్డి



సెంట్రల్ జైలు వద్ద మిథున్ రెడ్డిని కలిసిన మాజీ ఎంపీ భరత్ రామ్



మిథున్ రెడ్డితో పార్లమెంటరీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న మిథున్ రెడ్డి, జక్కంపూడి గణేష్ తదితరులు

ప్రార్థనలు

రాజమహేంద్రవరం సిటీ: సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి శనివారం ప్రకాశం నగర్‌లోని జక్కంపూడి స్వగృహంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎంపీ చింతా అనురాధ, డాక్టర్ జక్కంపూడి సుకీర్తి, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



రణభేరి జాత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ విద్యారంగంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి జాతా చేపట్టనుంది. ఈ కార్యక్రమ పోస్టర్‌ను శనివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆవిష్కరించింది. రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ కుమారి నేతృత్వంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి రణభేరి జాతాలు మొదలవుతాయని, ఐదు రోజుల పాటు అన్ని ప్రాంతాల్లో ఇవి పర్యటిస్తాయన్నారు. ప్రభుత్వ విధానాలు విద్యా వ్యవస్థను అధోగతి పాలు చేస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. 15 నెలలు కావస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 5న విజయవాడలో భారీ రణభేరి సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.విజయ గౌరీ, జిల్లా కార్యదర్శులు రవిబాబు, దయానిధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రూపస్‌రావు, జిల్లా కార్యవర్గం శ్రీనుబాబు, శ్రీనివాసరావు, విజయ్ బాబు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



గిరజాల వీర్రాజు (బాబు)



చందన నాగేశ్వర్



అద్దంకి ముక్తేశ్వరరావు



సక్కా శ్రీనగేష్



గుబ్బల తులసీ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) పలువురు నాయకులను నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో వివిధ అసెంబ్లీ నియోజకర్గాల్లో సమన్వయం చేసుకుంటూ రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయంగా వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేటాయించిన నియోజకవర్గాలు

గిరజాల వీర్రాజు (బాబు)కు నిడదవోలు, కొవ్వూరు, చందన నాగేశ్వర్‌కు రాజానగరం, అద్దంకి ముక్తేశ్వరరావుకు రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం, సక్కా శ్రీనగేష్‌కు రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ జిల్లాకు చెందిన గుబ్బల తులసీకుమార్‌కు అనపర్తి నియోజవర్గాలను కేటాయించారు.

జేసీగా చిన్నరాముడు సేవలు అభినందనీయం

- కొనియాడిన కలెక్టర్ ప్రశాంతి
- కలెక్టరేట్‌లో సత్కారం



బదిలీపై వెళుతున్న చిన్నరాముడిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ మేఘ స్వరూప్

రాజమహేంద్రవరం సిటీ: జాయింట్ కలెక్టర్‌గా చిన్న రాముడు జిల్లాకు అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి కొనియాడారు. బదిలీపై వెళుతున్న ఆయనను శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికార హోదాలో ఎంత ఉన్నత స్థితిలో ఉన్నా మానవత్వం విషయంలో మృదు స్వభావం కలిగి ఉండడం చిన్న రాముడి ప్రత్యేకత అన్నారు. కొత్త విషయాలు నేర్చుకోవడం ఆయనకు పనిపై ఉన్న మక్కువకు నిదర్శనమన్నారు. జిల్లాలో పనిచేసిన ఏడాది కాలంలో యోగాంధ్ర, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరించారని, కొన్నిసార్లు వేచి చూసే ధోరణి వల్ల మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. నూతన జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్ మాట్లాడుతూ చిన్న రాముడు మంచి మనసున్న వ్యక్తిగా అందరిలోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. చిన్న రాముడు మాట్లాడుతూ ఈ ఏడాది కాలం తనకు గుర్తుండిపోయే తీపి జ్ఞాపకం అన్నారు. రెవెన్యూ అనుబంధ, ఇతర ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడటానికి తన వంతు కృషి చేశానన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవ రావు, కేఆర్‌సీసీ ఎస్డీసీ కె.భాస్కర్ రెడ్డి, డీఎస్‌వో వి.పార్వతి పాల్గొన్నారు.



పంటుపైకి చేరిన గణపతి విగ్రహాలు

గణనాయకా.. వీడుకోలిక

వినాయక చవితి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు రాజమహేంద్రవరంలోని హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలోని ఇసుక ర్యాంపు వద్దకు నిమజ్జనం కోసం సుమారు 4 వేల విగ్రహాలు తరలివచ్చాయి. నగరంలో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవ కమిటీలు ఊరేగింపుగా వీటికి తీసుకువచ్చాయి. గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, నదిలో నిమజ్జనం చేశాయి. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు, వీక్షించడానికి తరలి వచ్చిన భక్తులతో గోదావరి తీరం కిటకిటలాడింది.

– సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)





గోదావరిలో గణేశుని నిమజ్జనం

క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి రూ.1.61 లక్షల ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పెదపూడి: కిడ్నీ బాధితుడికి వైద్య ఖర్చుల కోసం సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు రూ.1,61,162 ఆర్థిక సాయం అందజేశారు. ఆ అసోసియేషన్ ఫౌండర్ కం చైర్మన్ వడ్డి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సంపర గ్రామానికి చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి, అక్కడ ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు చల్లపల్లి సతీష్‌కు కేవలం 20 ఏళ్ల వయసులోనే రెండు కిడ్నీలు పాడై, వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావు ఆర్థిక సాయం కోసం తమ సొంత ఊరు సంపరలోని ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులను ఆశ్రయించాడు. స్పందించిన సభ్యులు రూ.1,61,162 సేకరించి కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోషన్ చేతుల మీదుగా శనివారం మధ్యాహ్నం నాగేశ్వరరావుకు అందజేశారు. అలాగే కలెక్టర్ షణ్మోషన్.. సంపర అసోసియేషన్ కార్యక్రమాలను పరిశీలించి, అభినందించి బాధితుడి తండ్రికి మరో రూ.10 వేలు తన సొంత సొమ్ములు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కుందూరి వెంకట సుబ్బారావు కొమ్మన శ్రీనివాసరావు, యానాల మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆహారం.. ఆరోగ్యం

- పోషకాహారంతో ఎన్నో ప్రయోజనాలు
- ఈ నెల 12 నుంచి రాష్ట్రీయ పోషణ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 11 వరకూ కార్యక్రమాలు

రాయవరం: ఆరోగ్యకర జీవనంలో పోషకాహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. దానిలో ఎలాంటి లోపాలున్నా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా చిన్నారుల్లో పోషకాహార లోపాలు వారి భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారతాయి. పోషకాహార లోపాల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి స్త్రీ, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి అక్టోబర్ 11 వరకూ 8వ రాష్ట్రీయ పోషణ్ మాహ్ 2025 నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,546 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ్ అభియాన్–మిషన్ పోషణ్ 2.0 పేరుతో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఊబకాయం, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఏక్ పేడ్ మాకే నామ్, ఇన్‌ఫాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్ ప్రాక్టీసెస్, మెన్ స్ట్రీమింగ్ – ఇన్వాల్వింగ్ మెన్ ఇన్ న్యూట్రిషన్ అండ్ కేర్ గివింగ్ తదితర అంశాలను వివరిస్తారు.

పోషణ్ మా లోగో



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం (ఫైల్)

కోనసీమ జిల్లా పరిధిలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో మండపేట, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలోని 1,726 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,725 మంది గర్భిణులు, 5,848 మంది బాలింతలు, 901 మంది ఆరు నెలల లోపు చిన్నారులు, 7,017 మంది ఆరు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు, 8,041 మంది 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

కోనసీమ జిల్లా వ్యాప్తంగా గత విద్యా సంవత్సరంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా 1,81,759 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 70,254 మందికి రక్తహీనత పరీక్షలు నిర్వహించగా, 16,680 మంది ఎనిమిక్‌గా ఉన్నట్లు గుర్తించారు. అలాగే కంటి వైద్య పరీక్షల అనంతరం 3,300 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. 1,204 మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించగా, 100 మందికి హియరింగ్ ఎయిడ్స్ అందజేశారు. 10 మందికి గ్రహణం మొర్రి ఉన్నట్లుగా గుర్తించగా, వీరిలో 9 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో జూలైకు సంబంధించి 7,303 మంది గర్భిణులు ఉండగా, వారిలో 542 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. మొత్తం గర్భిణుల్లో 7.42 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. వారికి టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తున్నారు.



పోషకాహారం

పోషకాహారంపై అవగాహన

అందరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉంచాలని ప్రతి ఏటా సెప్టెంబర్‌లో జాతీయ పోషకాహార వారోత్సవాలను అమలు చేస్తున్నారు. గతంలో వారం రోజుల పాటు నిర్వహించగా, వీటిని ఇప్పుడు నెల రోజులకు పొడిగించారు. కోవిడ్ 19 తదనంతర పరిస్థితుల్లో పోషకాహారం మరింతగా తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పోషకాహార వినియోగంపై సూచనలు అందిస్తోంది. విటమిన్ ఏ లేకపోవడం వల్ల మన దేశంలో ఏటా 30 వేల మంది కంటి చూపును కోల్పోతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఊబకాయం వల్ల టైప్ – 2 డయాబెటీస్, ఫ్యాటీ లివర్ వ్యాధి, పిత్తాశయంలో రాళ్లు, కీళ్ల రుగ్మతలు, రక్త పోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయి. వీటి నివారణకు సరైన పోషకాహార వినియోగంపై అధికారులు అవగాహన కల్పించనున్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ



చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాల నివారణకు పోషణ మాసోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తాం. ముఖ్యంగా ఐదు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో లయన్ డిపార్ట్‌మెంట్లతో కలిసి కార్యక్రమాలు చేపడతాం. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళతాం.

– వై.విజయశ్రీ, ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గణపతి ఊరేగింపులో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపులో భాగంగా నిర్వహిస్తున్న ఊరేగింపులో అపశ్రుతి చోటుచేసుకుంది. విగ్రహాన్ని ఊరేగిస్తున్న ట్రాక్టర్ తొట్టెపై నుంచి ఒక వ్యక్తి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఒమ్మంగి గ్రామంలో శనివారం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఊరేగిస్తున్నారు. ఆ గ్రామంలోని అంబేడ్కర్ సెంటర్‌కు వచ్చేసరికి ట్రాక్టర్ తొట్టిలో ఉన్న అదే గ్రామానికి చెందిన దొండపాటి నూకరాజు (నాని) కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆ గ్రామ యువకులు బైక్‌పై ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించినట్టు సీహెచ్‌సీ వర్గాలు తెలిపాయి.

మహీంద్ర ఎలక్ట్రిక్ కార్ల విడుదల



కార్లను విడుదల చేస్తున్న మహీంద్ర సంస్థ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ఎంఅండ్ఎస్ మోటార్స్ షోరూంలో శనివారం మహీంద్ర ఎలక్ట్రిక్ వాహనాలైన ఎక్స్‌యూవీ 9ఈ, బీఈ6ల నుంచి ప్యాక్–2 వెర్షన్లను ఆ సంస్థ ప్రతినిధులు మార్కెట్ లోకి విడుదల చేశారు. ఇతి తక్కువ వ్యవధిలోనే (5 నెలల్లో 20 వేల మంది వినియోగదారులు) అత్యున్నత ఆదరణను పొందిన ఈ కార్లను మరింతగా వినియోగదారులకు చేరువ చేసేందుకు కొత్త వెర్షన్లు ఆవిష్కరించినట్టు తెలిపారు. ఎక్స్‌యూవీ 9ఈ ప్యాక్–2 ధర రూ.24,90,000, బీఈ6 ప్యాక్ ధర రూ.21,90,000 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించారు. ఇవి 59, 79 కేడబ్ల్యూ బ్యాటరీ ప్యాక్‌లతో పాటు 7, 11 కేవీ చార్జర్లలో లభిస్తున్నాయన్నారు. అడాస్ లెవెల్–2++, 1 విజన్ కెమెరా, 1 రాడార్ సిస్టమ్‌తో ఎంఈ4యు యాప్‌తో కనెక్ట్ చేసుకుంటే వాహన స్థితిగతులను వినియోగదారుడు తన మొబైల్ నుంచే గమనించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎండీ రాధాకృష్ణ, డైరెక్టర్ శ్రీరాం, జీఎం రాజ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి అస్సాం వాసి మృతి

తుని: రైలు నుంచి జారి పడి అస్సాంకు చెందిన వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వివరాల్లోకెళితే.. అస్సాంలోని గోలఘాట్ జిల్లాకు చెందిన రోమన్ గోగోయ్.. డిబ్రూఘర్ నుంచి కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. ప్రమాదవశాత్తూ నర్సీపట్నం – గుల్లిపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు శనైశ్చరాలయం మూసివేత

కొత్తపేట: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి ఆలయం మూసివేయనున్నారు. ఈ విషయాన్ని దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 9.55 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకూ చంద్ర గ్రహణం ఉంటుందన్నారు. దీంతో గ్రహణ సమయానికి ముందుగానే మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం మూసివేయనున్నట్టు తెలిపారు. మళ్లీ సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం 8 గంటలకు ఆలయాన్ని తెరిచి తైలాభిషేకాలు, భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని తెలిపారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వార్డు మెంబర్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంక పంచాయతీ రెండో వార్డు మెంబర్ కముజు వీర వెంకట సత్యనారాయణ (48) శనివారం కొబ్బరి చెట్టుపై నుంచి పడి మృతి చెందారు. ఉదయం కొబ్బరి బొండాం కోసం చెట్టు ఎక్కి, కాలు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించగా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య శ్రీలక్ష్మి, ఒక కుమార్తె, వృద్ధ తల్లిదండ్రులు సత్యనారాయణ, సత్యవతి ఉన్నారు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాయమంద జేసీ

- ఉద్యోగం పేరుతో మోసపోయిన దివ్యాంగుడు
- భార్యాపిల్లలతో సహా చెన్నైలో చిక్కుకున్న వైనం
- రక్షించిన జాయింట్ కలెక్టర్ నిషాంతి



జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం రూరల్: ఉద్యోగం పేరుతో మోసానికి గురై, చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిక్కుకున్న దివ్యాంగుడు, అతడి కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ నిషాంతి రక్షించారు. వివరాల్లోకి వెళితే.. అమలాపురానికి చెందిన నాగేశ్వరరావు అనే దివ్యాంగుడికి ఉద్యోగం ఇప్పిస్తానని శంకర్రావు అనే వ్యక్తి నమ్మించాడు. చెన్నైలో ఉద్యోగం ఉందంటూ చెప్పి నాగేశ్వరరావు, అతడి భార్య, పిల్లలను తీసుకువెళ్లాడు. చెన్నైలోని సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దిగిన తర్వాత, వారి దగ్గర ఉన్న డబ్బులను తీసుకుని పరారయ్యాడు. వెంటనే నాగేశ్వరరావు.. జేసీ నిషాంతికి ఫోన్ చేసి, తన పరిస్థితిని వివరించాడు. భార్యాపిల్లలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. స్పందించిన జేసీ.. వెంటనే చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి, నాగేశ్వరరావు కుటుంబానికి రైలు టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలను ఏర్పాటు చేయించారు. ఖర్చు కోసం తన సొంత డబ్బును పంపించి ఆ కుటుంబాన్ని రక్షించారు.

నేడు అద్దేపల్లి సాహిత్య పురస్కార ప్రదానం

బోట్‌క్లబ్ (కాకినాడ): ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారాన్ని రాజమహేంద్రవరానికి చెందిన రెంటాల వెంకటేశ్వరరావుకు ప్రదానం చేయనున్నారు. కాకినాడలోని రోటరీ హాల్లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు అద్దేపల్లి రాధాకృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. పురస్కార ప్రదానం అనంతరం వచన కవిత పోటీలు నిర్వహిస్తామని, వాటికి దొండపాటి నాగజ్యోతి శేఖర్ న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తారన్నారు.

220 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పాచిపెంట: విజయనగరం, పార్వతీపురం మన్యం మీదుగా ఒడిశా రాష్ట్రానికి అక్రమంగా లారీలో తరలిస్తున్న 220 టన్నుల రేషన్ బియ్యాన్ని పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో శనివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లంపూడి నుంచి ఒడిశాలోని నౌగాంకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిసింది. చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ సీఐ సింహాచలం, సిబ్బందితో కలిసి లారీని పట్టుకున్నారు. విచారణ అనంతరం స్థానిక సీఎస్‌డీటీ హేమలతకు అప్పగించారు. బియ్యాన్ని మంచాడవలస జీసీసీ గోదాంలో భద్రపరిచారు. పట్టుకున్న సరకు విలువ సుమారు రూ.11.53 లక్షలు ఉంటుందని అంచనా. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై రామారావు, హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు, కానిస్టేబుల్ తిరుపతిరావు ఉన్నారు.

లారీపై జనసేన గుర్తులు

బియ్యాన్ని తరలిస్తున్న లారీపై పెద్ద అక్షరాలతో జనసేన పేరుతో పాటు, ఆ పార్టీ గుర్తులు ఉన్నాయి. జనసేనకు చెందిన నాయకుడి వాహనంగా తెలుస్తోంది. ఆ బియ్యం తరలింపులో పార్టీ వారి పాత్ర ఉందా? లేకుంటే కేవలం లారీనే ఇచ్చారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.